www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 25 జులై 2023
5
చిత్తూరు





స్పందన కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్

పెరిగిన ధరలతో.. వార్డెన్లకు మెనూ కష్టాలు



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

సంక్షేమ వసతి గృహాల్లో మెనూ అమలుకు వార్డెన్లు అవస్థలు పడుతున్నారు. అమాతంగా పెరిగిన కూరగాయల ధరలతో మెనూ ప్రకారం ఎలా వండి వడ్డించాలి రా.. దేవుడా.. అంటూ తలలు పట్టుకుంటున్నారు. ప్రభుత్వం నుండి సంక్షేమ వసతి గృహాలకు ఎప్పుడు బిల్లులు వస్తాయో తెలీని పరిస్థితి. అప్పులు చేసి మరీ వసతి గృహాల్లో మెనూ ప్రకారం విద్యార్థులకు వంట చేయాల్సిన పరిస్థితి నెలకొందని కొందరు వార్డెన్లు వాపోతున్నారు.

మార్కెట్లో కూరగాయల ధరలు ఇలా...

మార్కెట్లో టమోటా, పచ్చిమిర్చి, బీన్స్ కిలో వంద రూపాయలు అమ్ముడుపోతోంది. క్యారెట్, చిక్కుడు, బీర, బెండకాయ, సొరకాయ, ఇతర రకాలు కిలో రూ.60కి పైనే. కందిపప్పు, పెసరపప్పుతో కూరగాయలు కలిపి సాంబారు చేయాలి. ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాల్లో ఏర్పాటు చేసిన మెనూ పట్టిక ప్రకారం ఆహారం అందించాల్సి ఉటుంది. మెనూ ప్రకారం అయితే ప్రభుత్వం 2018-23లో మెనూ ఛార్జీలు పెంచింది. ప్రస్తుత నిత్యావసర వస్తువులతో పాటు కూరగాయల ధరలు పెరగడంతో కొంతఇబ్బంది ఉందని వార్డెన్లు చెబుతున్నారు. ఈఏడాది మార్చి, ఏప్రిల్, జూన్ నెలల బిల్లులు ప్రభుత్వం చెల్లించాల్సి ఉందంటున్నారు.

మెనూ ఇలా...

2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి పాఠశాల, కళాశాల విద్యార్థులకు దినసరి ఆహార పట్టికను రూపొందించి అమలు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పాఠశాల వసతిగృహాల్లో వారంలో ఆదివారం బిర్యాని, మూడు రోజులు చికెన్‌తోపాటు ఆరు కోడిగుడ్లు, అరటి పండు, ఉదయం అల్పాహారంలో విద్యార్థులకు విధిగా పాలు ఇవ్వాల్సి ఉంది. వాటితో పాటు వేరుశనగ చిక్కీ, ఉడికించిన బఠాని, అలసంద, పచ్చిశనగ గుగ్గిళ్ళు, రాగిలడ్డు, రవ్వ కేసరిని స్నాక్స్‌గా పెట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు సంక్షేమ వసతి గృహాల్లో పట్టిక ఏర్పాటు చేశారు. కళాశాల విద్యార్థులకు వారంలో రెండు రోజులు చికెన్, ఆరు కోడిగుడ్లు, అరటిపండు ఇవ్వాలి, వాటితో పాటు పాఠశాల మాదిరిగానే కూరగాయలతో వండాల్సి ఉంటుంది.

డైట్ ఛార్జీలు ఇలా...

ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాల ఇచ్చే డైట్ ఛార్జీలు మూడు, నాలుగు తరగతులకు గతంలో వెయ్యి రూపాయలుగా ఉంటే ప్రస్తుతం రూ.1,150, ఐదు నుండి పదో తరగతి వరకు ఉన్న విద్యార్థులకు గతంలో రూ.1,250 ప్రస్తుతం రూ.1,400, ఇంటర్ ఆపై విద్యార్థులకు రూ. 1,400 నుంచి రూ. 1,600లు ప్రభుత్వం పెంచింది. ప్రస్తుత మార్కెట్లో కూరగాయల ధరలు అమాతం పెరిగిపోవడంతో సంక్షేమ వసతిగృహాల నిర్వాహకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెరిగిన కూరగాయల ధరలతో ఇబ్బంది పడుతున్నా సాధ్యమైనంత వరకు మార్కెట్ల నుంచి కూరగాయలు కొనుగోలు చేస్తున్నట్లు చెబుతున్నారు. ప్రభుత్వం మెనూ ఛార్జీలు పెంచడంతో పాటు బిల్లులు ఆలస్యం చేయకుండా చెల్లించాలని కోరుతున్నారు.



స్పందనకు 294 అర్జీలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: స్పందనలో వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. ప్రతి సోమవారం చిత్తూరు జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందన జిల్లా జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, డిఆర్‌ఓ ఎన్.రాజశేఖర్‌తో కలసి జిల్లా నలుమూలల నుండి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి అర్జీలను స్వీకరించారు. స్పందన కార్యక్రమంలో మొత్తంగా 294 అర్జీలు రాగా.. ఇందులో శాఖల వారీగా అర్జీల వివరాలు ఇలా ఉన్నాయి. రెవెన్యూ శాఖకు సంబంధించి 213, జిల్లాఎండోమెంట్ 1, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ 1, జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ7, పోలీసు శాఖ 1, నగర పాలక సంస్థ 2, గురుకులం 1, డ్వామా 1, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ 1, నేషనల్ హైవే 1, ఏపిఎస్ ఆర్‌టిసి 1, డిఎం అండ్ హెచ్‌ఓ 2, డిసి హెచ్‌ఎస్ 1, ఏపీ ఎస్పిడిసిఎల్ 1, సిరికల్చర్ 1, జిల్లా సబ్‌రిజిస్ట్రార్ 1, బిసి వెల్ఫేర్ 1, జిల్లా హౌసింగ్ శాఖ 6, పెన్షన్, రేషన్ కార్డులు, ఇతరులు 50 అర్జీలు రావడం జరిగిందని తెలిపారు. స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీల మీద సత్వరం చర్యలు తీసుకుని పరిష్కరించాల్సిందిగా జిల్లా అధికారులను జెసి ఆదేశించారు.

'స్పందన' వినతులకు సత్వర పరిష్కారం : కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్పందన కార్యక్రమంలో అందే వినతులకు సత్వర పరిష్కారం చూపాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ నగరపాలక అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి కమిషనర్ నేరుగా వినతులు స్వీకరించారు. వినతులపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయి విచారణ చేసి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గతవారం అందిన వినతులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. స్పందన వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరించి నివేదిక సమర్పించాలన్నారు. సోమవారం నాటి స్పందన కార్యక్రమంలో ఇంజనీరింగ్ 3, ప్రధాన కార్యాలయం 1, మెప్మా 1 మొత్తం ఐదు వినతులు అందాయి. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంఈ వెంకట ప్రసాద్, ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, పాల్గొన్నారు.



స్పందనలో వినతులు స్వీకరిస్తున్న నగర కమిషనర్

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం చేయకండి : ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్టప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ వై. రిషాంత్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యాక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు నేరుగా ఎస్పిని అడిషనల్ ఎస్పీ అడ్మిన్ సుధాకర్, డిషనల్ ఎస్పీ శ్రీమతి శ్రీలక్ష్మిని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ ఫిర్యాదులకు స్పందిస్తూ త్వరితగతిన విచారణ జరిపి న్యాయం చేయాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో మొత్తం 24 ఫిర్యాదులు అందాయి. ఇందులో కుటుంబ తగాదాలు 4, వేధింపులు 2, ఇంటి తగాదాలు 3, చీటింగ్ 3, భూతగాదాలు 10, ఆస్తి తగాదాలు 2 ఉన్నాయని తెలిపారు.



స్పందన కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ

అర్జీల పరిష్కారంలో నాణ్యతకే ప్రాధాన్యత: జెసి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జగనన్నకు చెబుదాం వినతుల పరిష్కారంలో ప్రజలు సంతృప్తి శాతం పెరిగేలా పరిష్కారం ఉండాలని ఆ దిశగా అధికారులు పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరం నుండి వివిధ శాఖల జిల్లా స్థాయి అధి కారులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండలస్థాయి అధికారులతో జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష, ఏపీ సేవా, మీసేవా ఇతర సంబంధిత అంశాలపై సమీక్ష సమావేశం డిఆర్‌ఓ ఎన్.రాజశేఖర్‌తో కలిసి నిర్వహించారు. ఈసందర్భంగా జెసి మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం వినతుల పరిష్కారంలో ప్రజల సంతృప్తి శాతం పెరిగేలా, నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని వినతులపై తీసుకుంటున్న చర్యలను అర్జీదారులకు పూర్తిగా వివరించాలని తెలిపారు. స్పందన అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఎకి వెళ్లకుండా పరిష్కారం చూపాలన్నారు. జగనన్నకు చెబుదాం, స్పందన గ్రీవెన్స్‌లను మండల స్థాయిలోనే పరిష్కారమయ్యేలా అధికారులు పనిచేయాలని తెలిపారు. రీఓపెన్ కేసులకు తావ్విరాదని, సమస్యల పరిష్కారం నిమిత్తం క్షేత్రస్థాయిలో పర్యటించి అర్జీదారుడుతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. జిల్లాలో బియాండ్ ఎస్ఎల్ఏ మరియు 24 గంటలు 48 గంటల లోపల పరిష్కారం అయ్యే సమస్యలు ఏవి పెండింగ్లో లేవని ఎప్పటికప్పుడు వచ్చిన అర్జీలను పరిష్కరించాలన్నారు. మండలాల వారీగా ఈ కేవైసీ 100శాతం ఆడిట్ పూర్తి చేయాలని మంగళవారం సాయంత్రానికల్లా ఈకే వేసి ప్రక్రియను పూర్తిచేసేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.ఏపీ సేవా,మీ సేవా కింద అందిన సేవా రుసుంను పెండింగ్ లో లేకుండా ఎప్పటికప్పుడు జమ చేయాలని తెలిపారు. ఈనెల 29న ప్లాంటేషన్‌లో భాగంగా ప్రతి మహిళ అధికారి, మహిళా సిబ్బంది ఒక మొక్కను నాటాలని, దీనిని జిల్లా స్థాయిలోనే కాకుండా మండల స్థాయి వరకు నిర్వహించాలని ఇందుకు సంబంధించిన ఫోటోలను అప్లోడ్ చేయాలని జెసి సూచించారు. ఈసమీక్షలో జడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, డిఆర్డిఏ, డ్వామా పీడీలు తులసి, గంగాభవాని, హౌసింగ్ పీడీ పద్మనాభం, ఇరిగేషన్ ఎస్ఈ విజయ్ కుమార్‌రెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ, డిపిఓ లక్ష్మి, సోషల్ వెల్ఫేరి రాజ్యలక్ష్మి, డిఎస్ఓ శంకరన్, సిపిఓ ఉమాదేవి, డిఎల్‌డిఓ రవికుమార్, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నగర అభివృద్ధిపై జేసీకి వినతి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు నగర ప్రధాన సమస్యలను పరిష్కారానికి ప్రత్యేకశ్రద్ధ పెట్టాలని కోరుతూ సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్‌కి మన చిత్తూరు అభివద్ధి వేదిక కన్వీనర్ చైతన్య, కో-కన్వీనర్లులు అజమతుల్లా, కేశవరెడ్డి, మురళి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చిత్తూరు పేరుకే జిల్లా కేంద్రంగా ఉన్నప్పటికీ అభివద్ధి మొత్తం తిరుపతి చుట్టూ కేంద్రీకరించబడి చిత్తూరు నగరం అభివద్ధి విషయంలో నిర్లక్ష్యానికి గురైందని జాయింట్ కలెక్టర్ దష్టికి తీసుకొచ్చారు. నగరంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, నైపుణ్య యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్, ఐటిఐ కాలేజీలు ఏర్పాలు చేయాలన్నారు. అలాగే చిత్తూరు నుంచి చెన్నైకి రైలు సౌకర్యం కల్పించాలని, చిత్తూరులో 200 పడకలతో ఆసుపత్రి ఏర్పాటు చేయాలని కోరారు. వీటితోపాటు పలు ప్రధానమైన సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని జెసికి అందచేశారు.



జెసికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

రెవెన్యూ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రెవెన్యూ సమస్యలు గుర్తించి అప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అన్నారు. సోమవారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ వివిధ రెవెన్యూ సమస్యలకు సంబంధించి నివేదికలు తయారు చేయాలని అందులో ప్రధానంగా స్మశాన వాటికలు, అసైన్మెంట్ భూములు, స్పందన అర్జీలకు సంబంధించి, కోర్టు కేసులకు సంబంధించి, వన్ టైం కన్వర్షన్‌కు సంబంధించి, ఇంక్రోచ్మెంట్ రెగ్యులరైజేషన్, రీసర్వే కు సంబంధించి మంగళవారం సాయంత్రం లోపల నివేదికలు తయారుచేసి ఉంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ రాజశేఖర్ కలెక్టరేట్ లోని వివిధ విభాగాలకు చెందిన సూపరిండెంట్లు రివ్యూలో పాల్గొనగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ మండలాలకు చెందిన తహాశీల్దార్లు వీఆర్వోలు ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

ఎన్‌సిడి సర్వే పక్కాగా చేయండి: జెసి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వాతావరణంలో భారీ ఎత్తున మార్పులు వస్తున్నాయి కాబట్టి ప్రజల ఆరోగ్యం కోసం అత్యంత పకడ్బందీగా సర్వేలు నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు అన్నారు. సోమవారం సాయంత్రం వైద్యఆరోగ్య అధికారులు, ముఖ్యశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ 56వ ఫీవర్ సర్వే కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించి బాధితులను గుర్తించాలన్నారు. అదేవిధంగా మలేరియా వంటి వ్యాధుల విషయంలో ప్రజలకు అవసరమైన అవగాహన కల్పించి చర్యలు తీసుకోవాలని అన్నారు. పలు ప్రాంతాల్లో శానిటేషన్, పరిశుభ్రత పాటించడం ద్వారా ప్రజలను సంరక్షించే పనిబాధ్యతగా నిర్వహించాలని అన్నారు. నగరపాలక, మున్సిపల్, గ్రామీణ ప్రాంతాలలో ఉన్న సమస్యలను పరిష్కరించడం చేయాలన్నారు. ఆధార్ లాగానే ఆయుష్మాన్ భారత్‌లో భాగస్వామ్యులను చేయాలన్నారు. గ్రామీణ స్థాయిలో అన్ని విధాల శానిటేషన్, పరిశుభ్రత సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ఎస్సీ ఇంటర్ విద్యార్థులకు సంభందించి వివిధ సమస్యల వల్ల 1173 మందికి స్కాలర్ షిప్ రావడం లేదని వారికి సంబంధించి బ్యాంక్ సమస్యలు పరిష్కరించాలని అన్నారు. విద్యార్థులకు సంబంధించి వేగంగా స్పందించి పరిష్కరించాలన్నారు. జగనన్న విద్య దీవెన, వసతి దీవెనకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఓ రాజశేఖర్, సీఈఓ ప్రభాకర్ రెడ్డి, డిడి సోషియల్ వెల్ఫేర్ రాజ్యలక్ష్మి, డిపిఓ లక్ష్మి, మలేరియా అధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

యువత నైపుణ్య శిక్షణ కోసం స్కిల్ కాలేజ్

డిఆర్‌డిఏ పీడీ తులసి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు జిల్లాలోని గ్రామీణ నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశ్యంతో చిత్తూరు టిటిడిసిలో డిఆర్‌డిఏ - సీడాప్ ఆధ్వర్యంలో స్కిల్ కాలేజ్‌ని ప్రారంభిస్తున్నట్లుగా డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ డిఎంకే. తులసి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ స్కిల్ కాలేజ్‌లో నాలుగు నెలల రీటైల్ సూపర్వైజర్ కోర్స్ నందు ఉచిత శిక్షణ కల్పించి ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. శిక్షణ కాలంలో శిక్షణ పొందు అభ్యర్థులకు ప్రభుత్వం ఉచిత భోజన వసతి సదుపాయాలతో పాటుగా యూనిఫారం, స్టడి మెటీరియల్ కూడా ఇవ్వడం జరుగుతుంది. పూర్తి హాజరుతో శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్‌తో పాటు 100శాతం ప్లేస్మెంట్ గ్యారంటీ కూడా ఉంటుందని తెలిపారు. ఈ స్కిల్ కాలేజీ నందు శిక్షణకు డిగ్రీ పూర్తి చేసుకున్న వారు లేదా 2021 సంవత్సరానికి ముందు ఇంటర్మీడియట్ పూర్తి చేసి 18 సంవత్సరాల నుండి 28 సంవత్సరాలు వయసు కలిగిన వారు అర్హులు అని, ఆసక్తి-అర్హత కలిగిన యువతీ యువకులు బయోడేటా, విద్యార్హత సర్టిఫికేట్లు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్టు సైజు పోటోలతో చిత్తూరు టిటిడిసీ శిక్షణా కేంద్రంలోని శిక్షణా సంస్థ అధికారులను కలవాలని పథక సంచాలకుల వారు తెలిపారు. మరిన్ని వివరాలకు బి.ఈశ్వరి, జాబ్స్ ఏపిఎం, 93905 04650, కె.శోభన్‌బాబు, ఎస్ఆర్‌టిపి ట్రైనర్ 90521 82074 నెంబర్లను సంప్రదించగలరని తెలియజేశారు.

సాగునీటి కాలువను పూడ్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

కలెక్టర్‌కు రైతు విన్నపం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఐరాల మండలం కాణిపాకం దళితవాడకు చెందిన చిన్నపాటి రైతు భాస్కరయ్యకు సంబంధించిన వ్యవసాయ భూమికి, పొలాలకు తరతరాలుగా ఏటి వంక, చెరువు నీళ్ళు, వర్షపు నీళ్ళ వస్తున్న కాలువను పూడ్చి వ్యవసాయం పొలానికి చెరుకుతోటకు నీళ్ల రాకుండా చేసిన వారిపై చర్యలు తీసుకుని, దళిత రైతుకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సిపిఐ, డిహెచ్‌పిఎస్ నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ తరతరాలుగా దళిత రైతు సంబంధించిన వ్యవసాయ పొలాలకు చెరుకు తోటలకు పైనుండి చెరువు నీళ్ల, ఏటివంక నీళ్ల, వర్షపు నీళ్ళ కాలువల ద్వారా వస్తున్న నీటి ద్వారా పొలాలు పండించుకుంటున్న భాస్కరయ్య పొలాలకు నీళ్ల రాకుండా కాలు ఉన్న అడ్డుకొని రాతి కుసాలు నాటి కాలువను పూడ్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, రైతుకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు విసి.గోపీనాథ్, కె.మణి,దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) నాయకులు దాసరి చంద్ర, పెనుమూరు బాబు, పి.రఘు, రైతు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి : కలెక్టర్



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పిల్లలకు వ్యాధినిరోధక టీకాలు వేయించి జిల్లాను మమ్స్, రుబెళ్ళ లేకుండా తీర్చిదిద్దాలన్నదే లక్ష్యంగా ఉధృత మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంను ప్రభుత్వం చేపట్టడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ తెలిపారు. సోమవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు జిల్లా కలెక్టర్ చాంబర్ నందు జిల్లా కలెక్టర్ గారి ఆధ్వర్యంలో జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం వైద్యఆరోగ్యశాఖతో పాటు, ఐసిడిఎస్, పంచాయతీరాజ్, హ్యూమన్ రిసోర్స్ డెవలప్మెంట్, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ తో కలసి నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... వ్యాధి నిరోధక టీకాలు వేసుకోని 0-5 సంవత్సరముల లోపల పిల్లలను, గర్భిణీలను ఏఎన్ఎం, ఆశా ఇంటింటి సర్వేలో గుర్తించి అందరి సహకారంతో 100శాతం పూర్తి చేయాలనే లక్ష్యంగా ప్రతి ఒక్కరు బాధ్యతతో రాబోవు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో ఆగస్టు 7 నుంచి 12 వరకు మొదటి విడతగా, సెప్టెంబర్ 11 నుంచి 16 వరకు రెండో విడతగా, అక్టోబర్ 9 నుంచి 14 వరకు మూడో విడతగా రొటీన్ వ్యాధి నిరోధక టీకా కార్యక్రమంతో నిర్వహించాలనన్నారు. అందరూ సమన్వయంతో పనిచేసి 0-2 సంవత్సరంలో టీకాలు తప్పిపోయిన పిల్లలకు, 2-5 సంవత్సరంలోపల బూస్టర్ వేసుకొని పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించి 2023 కి మమ్స్, రుబెళ్ళ లేని జిల్లా మరియు రాష్ట్రం గా తీర్చి దిద్దాలన్నదే లక్ష్యంగా అందరూ పని చేయాలనన్నారు.

ఐటిఐలలో మౌలిక వసతులు కల్పించాలి: ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రభుత్వ, ప్రైవేటు ఐటిఐలలో ఉన్న సమస్యలపై సోమవారం చిత్తూరు ప్రభుత్వ ఐటీఐలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా నాయకులు వాడ గంగరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వినోద్ కుమార్, కోకన్వీనర్లు బాలసుబ్రమణ్యం, దాము జిల్లా నాయకుడు గుణశేఖర్‌లు మాట్లాడుతూ ఐటిఐలలో మౌలిక వసతులు లేక విద్యార్థులు కోర్సు పూర్తయిన తర్వాత ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నెలకొందన్నారు. ప్రస్తుతం ఉన్న టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులకు నూతన మిషనరీలపై నైపుణ్యం లేకపోవడంతో ఉపాధి లేకుండా పోతుదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశం అభివద్ధి కావాలంటే పారిశ్రామికంగా అభివద్ధి కావాలని ఆ పరిశ్రమల్లో పనిచేయడానికి శిక్షణ ఉన్న వర్కర్స్ ఉండాలని లక్ష్యంతో పారిశ్రామిక శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశారని మరి ఆ కేంద్రాలను నేటి పాలకులు ఉద్దేశపూర్వకంగా నిర్వీర్యం చేయడం దుర్మార్గమన్నారు. టెక్ననల్ చదివిన విద్యార్థులు పూర్తయిన వెంటనే ఉపాధి దొరుకుతుందని ఉద్దేశంతో విద్యార్థులు చేరుతుంటే వారికి నిరాశ ఎదురవుతున్నదని తెలిపారు. రోజురోజుకీ ఐటిఐలలో విద్యార్థులు సంఖ్య తగ్గిపోతున్నది. కారణం ఉపాధి లేకపోవడం. కొత్తకొత్త కోర్సులు ప్రవేశపెట్టి విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన ప్రభుత్వాలు శిక్షణ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారు. వీటిపై దేశవ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ పోరాడుతున్నదని తెలిపారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆగస్టు 9న క్విట్ ఇండియా ఉద్యమం, స్వాతంత్రం ఉద్యమం అంశాలపై విద్యార్థుల్లో చైతన్యం తీసుకురావడానికి వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నామని ఇందులో విద్యార్థులు అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న వాడ గంగరాజు, బాలసుబ్రమణ్యం

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్వయం సహాయక సంఘాల సభ్యులు సామాజిక రుగ్మతలు నిర్మూలనకు కషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి డాక్టర్ ఐ.కరుణ్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా మహిళా సమాఖ్య సమావేశంలో జిల్లా గ్రామీణ అభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లా సమాఖ్య సమావేశం జరిగింది. ఈకార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న తరుణంలో నేటికీ పలు ప్రాంతాల్లో మూఢనమ్మకాలు సామాజిక రుగ్మతలు కొనసాగుతున్నాయని ఇది విచారించదగ్గ విషయమన్నారు. సామాజిక రుక్మతుల నిర్మూలనకు స్వయం సహాయక సంఘ సభ్యులు కషి చేయాలన్నారు. స్వయం సహాయ సంఘాలు ఏర్పాటుతో మహిళల్లో చైతన్య నెలకొందని ఇదే దిశగా సమాజంలో ఉన్న రుగ్మతులను కూడా రూపుమాపేందుకు సంఘాలు చిత్తశుద్ధితో కషి చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల సమస్యల పరిష్కారం కోసం సంఘాల సభ్యులు బాధ్యతగా పనిచేయాలన్నారు. మహిళలు ఆర్థిక స్వాలంబనతో పాటు సమాజ అభివద్ధికి తమ వంతు తోడ్పాటు ఇవ్వాల్సిన అవసరం ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ముఖ్యంగా మహిళలు చట్టాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. న్యాయవ్యవస్థలో మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించడంతో పాటు ఉచిత న్యాయసేవలు అందించేందుకు అనేక సదుపాయాలను కల్పించినట్లు చెప్పారు. జిల్లా గ్రామీణసంస్థ ద్వారా మహిళా అభ్యున్నతికి అనేక పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందని వీటిని గ్రామీణ ప్రాంతంలోని మహిళలు చక్కగా వినియోగించుకుని సామాజిక ఆర్థిక స్వాలంబన పొందాలన్నారు. చిత్తూరు డిఆర్డిఏ పిడి తులసి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యులకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు ఈసదస్సు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కేవలం స్వయం సహాయక సంఘాలు రుణాలకే పరిమితం కాకుండా మహిళా చట్టాలు హక్కుల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు సంఘసభ్యులు చొరవ చూపాలన్నారు. మండలస్థాయి సమావేశాల్లో మహిళా చట్టాలపై సుదీర్ఘ చర్చ జరగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే సహాయక సంఘాలు సామాజిక సేవలో కూడా కీలకపాత్ర పోషించాలన్నారు. డిఆర్‌డిఏ అధికారులు వెంకటేష్, రవి, మధు, నాగేశ్వరరావు, సరిత అనురాధ, ప్రకాష్, హేమ, సూరి, జిల్లా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇచ్చి ఆదుకోవాలి



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ముస్లిం మహిళలు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ఇళ్ల స్థలాలు ఇచ్చి ఆదుకోవాలని తగ్గువారి పల్లి ముస్లిం మహిళలు సోమవారం తహశీల్దార్ బెన్ రాజుకు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం మహిళలు మాట్లాడుతూ గతంలో జగనన్న గృహకల్ప కార్యక్రమంలో ఇళ్లు మంజూరు చేశారని అవి ప్రస్తుతం రద్దయినట్లు వివరించారు. అలాగే సొంతిళ్లు ఉన్నవారికి కూడా ఇళ్లు మంజూరు చేశారని, క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హత గల వారికి, ఇళ్లు లేని నిరుపేదలకు స్థలాలు ఇచ్చి ఆదుకోవాలని తహశీల్దార్‌కు విన్నవించారు. వెంటనే తహశీల్దార్ స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలించి ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇళ్లు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

పార్టీ అభివృద్ధికి అందరూ కృషి చేయాలి



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-పాలసముద్రం: గ్రామస్థాయి నుంచి వైసీపీ నాయకులు అందరూ కలిసికట్టుగా పనిచేసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని జడ్పిటిసి సభ్యుడు అన్నలగం, మండల కన్వీనర్స్ తులసి రామ్ యాదవ్ తెలిపారు. సోమవారం పాలసముద్రంలోని వైసీపీ కార్యాలయంలో మండల పరిధిలోని పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పార్టీ అభివృద్ధి ప్రణాళికపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ మాట్లాడుతూ వైసీపీని మళ్ళీ అధికారంలోకి తీసుకురావాలంటే ఇప్పటినుంచి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై గ్రామాల్లో అవగాహన కల్పించి, గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడానికి అందరూ కషి చేయాలని తెలిపారు. అనంతరం వనదుర్గాపురం గ్రామానికి చెందిన గురు ప్రసాద్ రాజు, సముద్రం బీసీ కాలనీకి చెందిన శివ వారి అనుచరులతో వైసీపీలో చేరారు. వారికి మండల కన్వీనర్ తులసి రామ్ యాదవ్ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షురాలు ఇందిరమ్మ, భరోసా ఛైర్మన్ పోలయ్య, ఎంపిటీసీ గోవిందరాజులు, కుప్పమ్మ, సర్పంచ్ గాలి మహేష్ బాబు, అయ్యప్ప, అనురేఖ పాల్గొన్నారు.

అలరించిన సంగీత సాహితీ గేయధార



డాక్టర్ సాయికృష్ణ యాచేంద్రను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-కార్వేటినగరం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం డైట్ ఆడిటోరియంలో నిర్వహించిన డాక్టర్ విబి సాయి కృష్ణ యాచేంద్ర 408వ సంగీత సాహితీ గేయధార అందరిపా అలరించింది. సాహిత్యానికి సంగీతంతో కూడిన గేయ ధారనుజోడించి అలరించారు. వాణి, రాణి, పాణి, వేణి పదాలతో గేయాన్ని పాడాలని పండితులు కోరగా, నిషిద్ధ పదాలతో అప్రస్తుత ప్రసంగాల నడుమ తన సంగీత గేయ దారను కొనసాగించి అష్టావధానాన్ని మరిపించారు. కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థి, ప్రస్తుతం అమెరికా టెక్సాస్ యూనివర్సిటీ శాస్త్రవేత్త పుదూరు జగదీశ్వరన్ మాట్లాడుతూ తెలుగు సాహితీ సంగీత ప్రాశస్త్యాన్ని తెలియజేయడానికి అమెరికాలో యాచేంద్రచే కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి శతావధాని ఆముదాల మురళి సంచాలకులుగా వ్యవహరించారు. ముఖ్యఅతిథిగా తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి డైట్ ప్రిన్సిపల్ వి.శేఖర్, ప్రాశ్నికులుగా డాక్టర్ మన్నవ గంగాధర ప్రసాద్, ఐజేఏఎస్ టెక్నాలజీస్ డైరెక్టర్ సి.శోభరాజు ఆచార్య, పీసీ వెంకటేశ్వర్లు, ఎంపీపీ లతబాలాజీ, పూర్వవిద్యార్థుల అసోసియేషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎంపిక

ప్రజాశక్తి-నగరి: మండలంలోని శ్రీవాణీ గాయత్రీ బ్రాహ్మణ సంక్షేమ సంఘ నూతన కార్యవర్గాన్ని ఆ సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం కామాక్షీ సమేత కరకంటేశ్వర ఆలయంలో నిర్వహించిన బ్రాహ్మణ సంఘ సమావేశంలో అసోషియేట్ ప్రెసిడెంట్‌గా షడ్దర్శనం నాగేంద్ర ప్రసాద్, అధ్యక్షులుగా ఓరుగంటి బాల సుబ్రమణ్యం, కార్యదర్శిగా వందవాశి శివకుమార్ శర్మ, ఉపాధ్యక్షులుగా పురాణం నవీన్ కుమార్, కోశాధికారిగా కురుచెర్ల పాటి సురేష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా తుళా మార్గబందు శర్మ, రాంబట్ల మక్కి కుమారు, దేవుల పల్లి సురేష్, అర్చకం వాకాటి బాలాజి, ధర్మగాణి గురు రామచంద్రన్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ప్రతినెలా అమావాస్య రోజున సమావేశం జరుగుతుందని ప్రతి ఒక్కరూ హాజరు కావాలన్నారు. స్వర్గీయ వందవాశి నరసింహయ్య కుటుంబ సభ్యులు ఇచ్చిన స్థలంలో భవన నిర్మాణము తొందరగా చేపట్టడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా గుర్రం జాషువా వర్ధంతి

ప్రజాశక్తి-సోమల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం గుర్రం జాషువా, సర్ ఆర్థర్ కాటన్ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు కళాశాల ప్రిన్సిపల్ గంగాధర నాయుడు పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అవమానాలనే గెలుపుకు బాటలుగా చేసుకొని, కలాన్ని ఆయుధంగా మార్చుకొని, చీత్కారాలు ఎదురైన చోటే సత్కారాలు పొందిన రచయిత, సామాజిక సమానత్వానికి పోరాడిన కవి గుర్రం జాషువా అని కొనియాడారు. గోదావరి నదిపై ఆనకట్ట కట్టి ఉభయ గోదావరి జిల్లాలలో రైతుల భూములు సస్యశ్యామలంగా ఉండేందుకు ఆనకట్ట నిర్మించిన గొప్ప శాస్త్రవేత్త సర్ ఆర్థర్ కాటన్ అని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ జయరాం, అధ్యాపకులు గౌతం, శివయ్య, వెంకటరమణ నాయక్, రవీంద్రారెడ్డి, గీత, నాగరత్నమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

పలమనేరు: నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా వర్ధంతిని సందర్భంగా తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసి నాథం నాయుడు ఆధ్వర్యంలో కళామందిరంలో సోమవారం జాషువా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పుష్ప, శివ శంకర్ రెడ్డి, కౌశిక్, భార్గవి, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జాషువా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన దృశ్యం

'జగనన్న సురక్ష'తో ప్రజలకు మేలు



నగరి: ధ్రువీకరణ పత్రాలు పొందిన లబ్ధిదారులతో మంత్రి రోజా

ప్రజాశక్తి-నగరి: అర్హులై ఉండి ప్రభుత్వ పథకాలకు దూరమైన ప్రజలకు 'జగనన్న సురక్ష'తో ఎంతో మేలు కలుగుతుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజనసర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. సోమవారం మండలంలోని ముడిపల్లి గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 302 మందికి ఇంటిగ్రేటెడ్ కుల(ధ్రువీకరణ)పత్రాలు, 196 మందికి ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఇద్దరికి బియ్యం కార్డుల విభజన, 65 మందికి ఆధార్ మొబైల్ లింకింగ్, ఒకరికి పట్టాపాసుపుస్తకం అంటూ మొత్తంగా 566 మందికి వివిధ రకాల ధ్రువపత్రాలు అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ప్రజల ఇంటి వద్దనే ఉచితంగా 11 రకాల ధ్రువపత్రాలను అందిస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి వాసు, తహశీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీడీవో లీలా మాధవి, ఎంఈవో శ్రీదేవి, ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ కన్నియప్ప తదితరులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: జగనన్న సురక్ష ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఎంపీపీ అమరావతి అన్నారు. సోమవారం మండలంలోని పాలేరు సచివాలయం పరిధిలో తహశీల్దార్ బెన్ రాజు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో జిల్లావ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రామచంద్ర రెడ్డి, ఎంపీడీవో మధుసూదన్, జడ్పిటిసి సోమశేఖర్, పాలేరు, మొగిలి వెంకటగిరి సర్పంచ్‌లు ప్రసాద్ రెడ్డి, దీప్తి రెడ్డి, మాజీ సర్పంచ్ అన్నామల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రం ప్రారంభం

విజయపురం: మండలంలోని పన్నూరులో రూ 21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని మంత్రి ఆర్కే రోజా సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిలో తండ్రికి మించిన తనయుడుగా సీఎం జగన్మోహన్ రెడ్డి పేరు తెచ్చుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ జమున, వైస్ ఎంపీపీ బాలాజీ, జడ్పిటిసి రేవతి, తహశీల్దార్ వెంకటరమణ, ఎంపీడీవో ప్రసాద్, ఎంఈఓ ఆంజనేయులు పాల్గొన్నారు.

నేడు సోమలలో గ్రామసభ

సోమల: స్థానిక గ్రామ సచివాలయం వద్ద మంగళవారం ఉదయం 9 గంటలకు జగనన్న సురక్ష గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి సుధాకర్ కుమార్ సోమవారం తెలిపారు. ఈ గ్రామసభలో మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొంటారని, ఈ కార్యక్రమంలో ఇప్పటికే ధ్రువపత్రాలు కావాలని రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి వాటిని అందించనున్నట్లు ఆయన తెలిపారు.

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం



పభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పెద్దపంజాణి: రాష్ట్రంలోని ప్రజల సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యమని ఎమ్మెల్యే వెంకటే గౌడ అన్నారు. సోమవారం మండలంలోని ముత్తుకూరు సచివాలయ పరిధిలోని ముత్తుకూరు, నెర్నిపల్లి గ్రామాలలో స్థానిక సర్పంచ్ భార్గవ్ ఆధ్వర్యం లో ఎమ్మెల్యే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పంచాయతీలో 908 గృహాలను ఎమ్మెల్యే సందర్శించి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేద, బడుగు, బలహీన వర్గాలు ఇంగ్లీష్ మీడియం చదువులు చద వాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టి పిల్లల విద్యాభివద్ధికి కషి చేస్తున్నామని అన్నారు. తమ పిల్లలను బాగా చదివించాలన్న ఆలోచన ఈ విద్యా సంస్కరణల వల్ల తల్లిదండ్రుల కోరిక నెరవేరిందని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివద్ధిని చూసి ప్రతిపక్షాలకు ఎలా విమర్శించాలో అర్థంకాక నిరాధార ఆరోపణలు చేస్తూ తమ ఉనికిని కాపాడుకునే ప్రయత్నం చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. నిరుపేదలంతా జగనన్న వైపే ఉన్నారని, రాబోయే ఎన్నికల్లో వైసీపీకి 175 సీట్లు వస్తాయని జోష్యం చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డప్ప, జడ్పిటిసి సుష్మా కీర్తి, మండల కన్వీనర్ బాగారెడ్డి, స్థానిక సీనియర్ నాయకులు వెంకటరత్నం, ఎంపీటీసీ పద్మ సుబ్రమణ్యం, మాజీ మార్కెటింగ్ ఛైర్మన్ ప్రహ్లాద తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విజయానందరెడ్డి జన్మదిన వేడుకలు



ఎస్ఆర్ పురం: విజయానందరెడ్డిని పూలమాలతో సన్మానిస్తున్న స్థానిక నాయకులు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: ఏపీఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ ఎంసీ విజయానంద రెడ్డి జన్మదినం సందర్భంగా సోమవారం చిత్తూరులోని తన నివాసంలో ఆయన్ను జన్ అకాడమీ అధ్యక్షులు, గంగాధర నెల్లూరు నియోజకవర్గ వైసీపీ నాయకులు నూకతోటి రాజేష్ కలసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు అయ్యులు రెడ్డి, పెద్దబ్బ రెడ్డి, భాను, అశోక్ పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం: ఏపీఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ విజయానంద రెడ్డి జన్మదిన వేడుకలు మండలంలోని 49కొత్తపల్లిమిట్టలో స్థానిక నాయకులు, అభిమానులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా ఆయన స్వగ్రామంలో తల్లిదండ్రులకు నివాళులర్పించారు. అనంతరం 49 కొత్తపల్లి మిట్ట ప్రధాన కూడలిలో జననేత ఏపీఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ విజయానంద రెడ్డికి స్థానిక నాయకులు, అభిమానులు వినాయక స్వామి గుడిలో ప్రత్యేకంగా స్వామివారిని అలంకరించి అభిషేక సేవలు చేసిన అనంతరం విజయా నంద రెడ్డికి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆయన కోసం ప్రత్యేకంగా రూపొందించిన భారీ గజమాలతో సత్క రించి బాణాసంచాలు పేల్చి, అక్కడ ఏర్పాటుచేసిన భారీ కేకులు కట్ చేశారు. విజయానంద రెడ్డి అభిమానులు ఘనం గా అన్నదానం నిర్వహించారు. డిసిసిబి బ్యాంక్ డైరెక్టర్ బాలసుబ్రమణ్యం రెడ్డి, కొత్తపల్లి సర్పంచ్ డిల్లెయ్య, రమణ, ప్రసాద్ రెడ్డి, సూరి రెడ్డి, సుధా, యుగంధర్ పాల్గొన్నారు.

మహాశక్తి చైతన్య రథయాత్ర ప్రారంభం



రథయాత్ర వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న భానుప్రకాష్

ప్రజాశక్తి-నగరి: తెలుగుదేశం పార్టీ తెలుగు మహిళా విభాగం ఆధ్వర్యంలో నగరి మున్సిపాలిటీ పరిధిలోని కీళపట్టు వద్ద గ్రామదేవతలకు పూజలు చేసి మహాశక్తి చైతన్య రథయాత్ర వాహనాన్ని నగరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మహిళలతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయు డు విడుదల చేసిన మినీ మేనిఫెస్టో మహాశక్తి పథకం ద్వారా మహిళల ఆర్థిక కష్టాలు తీరుతాయని తెలిపారు. కుటుంబంలోని ప్రతి బిడ్డకు ఏడాదికి తల్లికి వందనం ద్వారా రూ.15 వేలు, ప్రతి మహిళకు నెలనెలా రూ.1500, ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్ల పంపిణీ లాంటివి మహిళలకు ఎంతగానో ఉపయోగ పడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు మహిళా అధికార ప్రతినిధి మీరా, పార్లమెంటరీ తెలుగు మహిళా అధికార ప్రతినిధి నిరోష, నగరి నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు సంపూర్ణమ్మ, నగరి రూరల్ తెలుగు మహిళా అధ్యక్షురాలు లక్ష్మీ, నగరి నియోజకవర్గ తెలుగు మహిళా సోషల్ మీడియా రజిని, పుత్తూరు తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మోహన తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం



ఆలయంలో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-నగరి: మండలంలోని బుగ్గఅగ్రహారంలో టీటీడీ అనుబంధంలో ఉన్న అన్నపూర్ణాసమేత కాశీ విశ్వేశ్వర ఆలయంలో సోమవారం దాతలు భక్తులకు అన్నదానం చేశారు. ఆలయానికి దర్శనానికి విచ్చేసిన భక్తులకు మోహన్ అనే దాత ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అన్నదానం చేశారు. ఆలయంలో అన్నదానం చేయదలచిన వారు ముందురోజు పేరు నమోదు చేసుకోవాలని టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గుణశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

వీధుల్లో పారుతున్న మురుగు

■ ఇబ్బందుల్లో కాలనీవాసులు

ప్రజాశక్తి-గంగవరం: మండలంలోని గండ్రాజుపల్లి పంచాయతీ దళితవాడలో మొత్తం 70 కుటుంబాలు ఐదు వీధుల్లో ఉన్నాయి. దళితవాడలోని ఒక్క వీధిలో కూడా డ్రైనేజ్ కాలువ లేకపోవడంతో వధా నీరు వీధుల వెంట పారుతూ ఉంటాయని, ఆ బురద నీటిలోనే నడవాలంటే ఇబ్బందులకు గురవుతున్నట్లు కాలనీవాసులు తెలిపారు. వారు అనేకసార్లు అధికారులు, నాయకుల దష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని వాపోతున్నారు. ఇక వర్షాకాలం ప్రారంభమైందని, ఈ ప్రాంతం మరింత దుర్లభంగా ఉంటుందని, దీంతో దోమలు ఎక్కువై రోగాలు బారిన పడటం ఖాయమని, ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని కాలనీ వాసులు కోరారు.



వీధిలో నిలచిన బురద నీరు

బాల్యవివాహాలపై ప్రత్యేక దృష్టి



బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో

ప్రజాశక్తి-కార్వేటినగరం: బాల్యవివాహాలపై అంగన్‌వాడీ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని ఐసీడీఎస్ సీడీపీవో పద్మసునంద అన్నారు. సోమవారం సీడీపీవో ఆధ్వర్యంలో బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ సిబ్బంది తమ పరిధిలో మేజర్, మైనర్ బాలికల వివరాలను సిద్ధం చేసుకొని, ప్రతి ఒక్కరూ ఆధార్ ద్వారా నిర్ధారించే వయస్సును బట్టి వివాహాలకు అనుమతి ఇవ్వాలని సూచించారు. కొందరు ఆస్తుల కోసం బాల్యవివాహాలు చేసి చేతులు దులుపుకుంటున్నారని, అలాంటి విషయాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఇందిరా, శ్యామిని, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మంత్రి రాక

ప్రజాశక్తి-గుడిపల్లి: మండలంలోని ఓఎన్ కొత్తూరు గ్రామ పంచాయతీలో మంగళవారం రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటించి పల్లెబాట కార్యక్రమంలో పాల్గొననున్నట్లు జడ్పిటిసి కష్ణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

సహాయకుల్లేని ప్రైవేటు పాఠశాలల బస్సులు

ప్రజాశక్తి-గంగవరం: మండల పరిధిలో ఎనిమిది ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. చుట్టు పక్కల గ్రామాల నుండి విద్యార్థులను తరలించే పాఠశాలల వాహనాలకు సహాయకులు లేకపోవడంతో చిన్న పిల్లలు బస్సులు ఎక్కి దిగడానికి తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నట్లు విద్యార్థులు తల్లిదండ్రులు తెలియజేస్తున్నారు. పాఠశాల యాజమాన్యం మాత్రం ఏమీ తెలియనట్లు మౌనం వహిస్తూ ఉందని, రూ.వేల ఫీజులు తీసుకోవడం తెలిసిన యాజ మాన్యం బస్సులకు మాత్రం సహాయకుల్ని ఏర్పాటు చేయకపోవడంతో తల్లిదండ్రులు దగ్గరుండి పిల్లలను దింపుకొని ఇల్లు చేరాల్సిన దుస్థితి ఏర్పడిందని అంటున్నారు. పుస్తకాల మోతతో సతమతమవుతున్న పిల్లలు దిగి ఎక్కడానికి వీలుకాలేదని, సహాయకులు తప్పనిసరి అని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

బంద్‌ను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-పలమనేరు: ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నియంత పాలనలో ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రుల నడ్డి విరుస్తున్న తరుణంలో తెలుగు నాడు విద్యార్థి సమాఖ్య మంగళవారం రాష్ట్రవ్యాప్త బందుకు పిలుపును ఇచ్చిందని అందరూ బంద్‌లో పాల్గొని జయప్రదం చేయాలని టిఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ నాయకులు మురళి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

బాలామృతం అందజేత



బాలామృతం ప్యాకెట్లను అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని గొల్ల చీమలపల్లి గ్రామపంచాయతీలో గల తావడగుప్పం అంగన్‌వాడీ కేంద్రంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన టిహెచ్ఆర్ పథకం అమల్లో భాగంగా సోమవారం అంగన్‌వాడీ టీచర్ ఆర్.వెంకటరత్నమ్మ అధ్యక్షతన 6 నెలల నుండి 3 సంవత్సరాల పిల్లల తల్లులకు బాలామతం, పాలు, కోడిగుడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సహాయకురాలు టిఎ వసంత, పిల్లల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



మృతి చెందిన మంజన్ కపాలి

ప్రజాశక్తి-పెద్దపంజాణి: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ శ్రీనివాసులు కథనం మేరకు వివరాలు... జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన మంజన్ కపాలి(25) వీరపల్లి పంచాయతీ పరిధిలోని పలమనేరు,చౌడేపల్లి రోడ్డులో రక్త గాయాలతో పడి ఉండటంతో స్థానికులు గుర్తించి రెవెన్యూ అధికారి వెంకటరమణకు సమాచారం అందించారు. దీంతో ఆయన స్థానిక పోలీసులకు సమాచారమివ్వడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతి చెందిన వ్యక్తిని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, వ్యక్తి మృతికి కారణాలు దర్యాప్తులో తెలియాల్సి ఉందని తెలిపారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం



చొక్కామడుగు గ్రామంలో వైద్యం నిర్వహిస్తున్న డాక్టర్ పల్లవి

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరమవుతాయని స్థానిక మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పల్లవి అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఎస్ఆర్ పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల ముదికుప్పం గ్రామపంచాయతీ చొక్కామడుగు గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం డాక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-పులిచెర్ల: గత ఎనిమిది సంవత్సరాలు ప్రధానోపాధ్యాయులుగా సేవలందించి, ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిఇటీవలే బదిలీపై పులిచెర్ల మండల విద్యాశాఖ అధికారిగా వెళ్ళిన పోకల తాతయ్య, అలాగే సుదీర్ఘ కాలం పాఠశాలల్లో పని చేసి వివిధ పాఠశాలలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు కన్నగి, గంగయ్య, అమర్‌నాథ్, గీతా దేవి, కృష్ణయ్య, పుష్పలత, జయ చంద్ర, మధుసూదన్ రెడ్డి, మోహన్ బాబులకు కల్లూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జడ్పిటిసి మురళీధర్ హాజరయ్యారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయులు వెంకటరమణారెడ్డి, మండల విద్యాశాఖ అధికారి సిద్దరామయ్య, ఎఎంవో అజయ్‌కుమార రెడ్డి, కాణిపాకం ఆలయ బోర్డు మెంబర్ మొవ్వల నరసింహుల శెట్టి, స్థానిక నాయకులు గోవిందరెడ్డి, నాదముని రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దపంజాణి: మన సమాజానికి ఉపాధ్యాయులు దిక్సూచి లాంటి వారని జిల్లా కార్యదర్శి, మాజీ ఎంపీటీసీ తమ్మిరెడ్డి, నాయకులు శంకర్ రెడ్డి అన్నారు. సోమవారం రాజుపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు నారాయణ, రెడ్డిమ్మ, అమరనాథ్, మోహన్‌ను వారు గ్రామస్తులతో కలిసి సన్మానించారు. ఎంపీటీసీ క్రిష్ణప్ప, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గౌరీశంకర్, ఉపాధ్యాయ బృందం, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పెద్దపంజాణిలో...

ఘనంగా శ్రావణమాస సోమవార పూజలు

ప్రజాశక్తి-సోమల: మండలంలోని పెద్ద ఉప్పరపల్లి సమీపంలో గల అటవీ ప్రాంతంలో వెలసిన గార్గేయ మునీశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాస సోమవార పూజలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి ఆపై అభిషేకాలను నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను పంచి పెట్టారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.



దుర్గం కొండ ఆలయ హిల్ వ్యూ